సాక్షి
వైఎస్సార్ జిల్లా
శుక్రవారం । 5 । మే । 2023



ఆర్టీసీలో కారుణ్య నియామకాలు
ఆర్టీసీలో పనిచేస్తూ మృతి చెందిన ఉద్యోగుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తోంది. మృతుల కుటుంబంలో ఒకరికి కారుణ్య నియామకం కింద ఉద్యోగం ఇస్తోంది. - 8లో



కడప, నెల్లూరు జట్లు విజయం
కడపలో ఏసీఏ అండర్-23 పురుషుల వన్డే క్రికెట్ టోర్నమెంట్ జరుగుతోంది. గురువారం జరిగిన మ్యాచ్‌లో కడప, నెల్లూరు జట్లు విజయం సాధించాయి. - 8లో



ప్రతిభ కనబరిచిన పంచాయతీలకు అవార్డులు
జిల్లాలో ప్రతిభ కనబరిచిన గ్రామ పంచాయతీలకు అవార్డులు ఇస్తామని జెడ్పీ సీఈఓ సుధాకర్‌రెడ్డి తెలిపారు. - 8లో

న్యూస్‌రీల్

రేపు మంత్రి, ఎంపీ రాక

ప్రొద్దుటూరు : పురపాలకశాఖ మంత్రి ఆదిమూలపు సురేష్, ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి శనివారం ప్రొద్దుటూరు రానున్నారు. ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవితో కలిసి పలు అభివృద్ధి పనులను ప్రారంభించనున్నారు. మొదట టూటౌన్ బైపాస్ రోడ్డులో రూ.76.10 లక్షలతో నిర్మించిన థర్డ్ కాలనీ పార్కును ప్రారంభిస్తారు. తర్వాత శివాలయం ఎదురుగా రూ.50 కోట్లతో నిర్మిస్తున్న కూరగాయల మార్కెట్‌ను పరిశీలిస్తారు. అనంతరం శ్రీరాములపేట వీధిలో రూ.కోటి వ్యయంతో నిర్మించిన డాక్టర్ వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించనున్నారు. రూ.120 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న అమృత్ వాటర్ వర్క్స్ పనులను పరిశీలించేందుకు రెండు కుళాయిల ప్రదేశానికి వెళ్లనున్నారు. 11.30 గంటలకు రూ.3.5 కోట్లతో నిర్మించిన మున్సిపల్ పార్కు అభివృద్ధి పనులను ప్రారంభించనున్నారు. మధ్యాహ్నం 1 గంటకు రాజేశ్వరి కాలనీలో వైఎస్సార్‌సీపీ నాయకుడు లక్కిరెడ్డి పవన్‌కుమార్ రెడ్డి ఇంటిలో ఏర్పాటు చేసిన విందుకు నాయకులంతా హాజరు కానున్నారు.

నేటి నుంచి వైఎస్‌ఆర్ ఏఎఫ్‌యూ సెమిస్టర్ పరీక్షలు

వైవీయూ : కడపలోని డాక్టర్ వైఎస్‌ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయంలో ఈనెల 5 నుంచి 16వ తేదీ వరకు 6వ సెమిస్టర్ పరీక్షలు నిర్వహించనున్నారు. విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ఆచార్య బానోతు ఆంజనేయప్రసాద్, రిజిస్ట్రార్ ఆచార్య ఇ.సి. సురేంద్రనాథ్‌రెడ్డి మార్గదర్శనంలో పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పరీక్షల నియంత్రణ విభాగం తెలిపింది. స్కూల్ ఆఫ్ ప్లానింగ్‌లోని డిజిటల్ టెక్నిక్స్ ఇన్ డిజైన్ అండ్ ప్లానింగ్, ఇంటీరియర్ డిజైన్, కాలేజ్ ఆఫ్ ఫైన్‌ఆర్ట్స్‌లోని పెయింటింగ్, ఫొటోగ్రఫీ, అప్లైడ్ ఆర్ట్స్, యానిమేషన్ విభాగాలకు పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

12న షిర్డీకి ప్రత్యేక బస్సు

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప రీజియన్‌లోని ప్రొద్దుటూరు డిపో నుంచి షిర్డీకి ప్రత్యేక ఇంద్ర ఏసీ బస్సు నడపనున్నామని రీజినల్ మేనేజర్ గోపాల్‌రెడ్డి తెలిపారు. ఈనెల 12వ తేదీ 9942 నంబరుగల సర్వీసు సాయంత్రం 5 గంటలకు ప్రొద్దుటూరు డిపో నుంచి బయలుదేరుతుందన్నారు. రాను, పోను రూ. 4,500 ఛార్జీగా నిర్ణయించారన్నారు. తుల్జాపూర్, భవానీమాత ఆలయం, శని శింగనాపూర్ ఆలయాలు దర్శించుకోవచ్చన్నారు. మైదుకూరు, ఆళ్లగడ్డ, నంద్యాల, కర్నూలు నుంచి కూడా ఈ సర్వీసుకు రిజర్వేషన్ సౌకర్యం కల్పించామని తెలిపారు. రిజర్వేషన్ కోసం 99665 25210 నంబరులో సంప్రదించాలన్నారు.

నకిలీ ఉద్యోగ ప్రకటనలు నమ్మొద్దు

కడప రూరల్ : నకిలీ ఉద్యోగ ప్రకటనలు నమ్మి మోసపోవద్దని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ నాగరాజు తెలిపారు. జాతీయ ఆరోగ్య సంస్థలో డాక్టర్ పీవైఏ ఖాన్ పర్యవేక్షణలో మహిళలకు డేటా సూపర్‌వైజర్ ఉద్యోగాలకు అవకాశం ఉన్నట్లు ప్రచారం జరుగుతోందని పేర్కొన్నారు. ఇలాంటి మోసపూరిత మాటలను నమ్మి మోసపోవద్దని తెలిపారు. ఎవరైనా ఉద్యోగాలు ఇప్పిస్తామని చెబితే తమకు తెలపాలని కోరారు.

వైవీయూ వెబ్‌సైట్‌లో పరీక్షల విభాగ సమాచారం



వెబ్‌సైట్‌ను ప్రారంభిస్తున్న వీసీ

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయం(వైవీయూ) కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ విభాగ వెబ్‌సైట్‌ను విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ ఆచార్య జింక రంగజనార్ధన ప్రారంభించారు. గురువారం వైవీయూలో రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య, ప్రిన్సిపాల్ ఆచార్య కె. కృష్ణారెడ్డి, పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య ఎన్.ఈశ్వరరెడ్డి, ఐటీ హబ్ డైరెక్టర్ ఆచార్య ఎం.వి.శంకర్‌లతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ వెబ్‌సైట్‌లో విద్యార్థుల పరీక్షల షెడ్యూలు, టైం టేబుల్, సర్టిఫికెట్స్‌కు సంబంధించిన అన్ని రకాల సమాచారం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ప్రొద్దుటూరు ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య నాగరాజు, వైవీయూ పరీక్షల నియంత్రణ విభాగం అధికారులు డా. ఆదినారాయణరెడ్డి, డా. సుమిత్ర పాల్గొన్నారు.

అరుణాచలానికి ప్రత్యేక ఆర్టీసీ బస్సులు

మదనపల్లె సిటీ : పౌర్ణమి పురస్కరించుకుని ప్రముఖ పుణ్యక్షేత్రమైన అరుణాచలానికి స్థానిక వన్, టు డిపోల నుంచి గురువారం ప్రత్యేక బస్సులు వెళ్లాయి. స్థానిక వన్‌డిపోలో ఆరు బస్సులల్లో భక్తులు వెళ్లారు. డీఎం మూరే వెంకటరమణారెడ్డి పూజలు నిర్వహించి యాత్ర స్పెషల్ బస్సులను ప్రారంభించారు. టు డిపో నుంచి ఆరు బస్సులు వెళ్లినట్లు డీఎం ఆర్‌సీ నిరంజన్ తెలిపారు.

జగనన్నకు చెబుదాం..

ఆనందంగా ఉందాం

- సీఎంకు నేరుగా వినతులు పంపే సౌలభ్యం
- మే 9 నుంచి కార్యక్రమానికి శ్రీకారం
- స్పందనకు మరింత మెరుగులు
- హెల్ప్‌లైన్ నంబరు 1902



కడప కలెక్టరేట్‌లో స్పందన కార్యక్రమం(ఫైల్)

కడప సెవెన్‌రోడ్స్ : ఓ వ్యక్తి తన భూమికి కొలతలు వేయించాలంటూ కలెక్టరేట్‌లో జరిగే స్పందన కార్యక్రమంలో అర్జీ సమర్పించాడు. ఈ సమస్య పరిష్కరించాలంటూ కలెక్టరేట్ నుంచి సంబంధిత తహసీల్దార్‌కు ఆదేశాలు వెళతాయి. ఆ తహసీల్దార్ ఆ పనిని సర్వేయర్‌కు అప్పగించి తన పని పూర్తి చేసినట్లు చెబుతారు. సర్వే నిర్వహించి హద్దులు ఏర్పరిచినపుడే సమస్య పరిష్కారం అయినట్లు. అప్పుడే అర్జీదారుడు సంతృప్తి చెందుతాడు. అలా జరగకపోవడం వల్ల అర్జీదారుడు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నాడు. ఇకపై అలాంటి వాటికి ఆస్కారం ఉండదు. సంతృప్తికర స్థాయిలో సమస్యను పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 9వ తేది నుంచి ×జగనన్నకు చెబుదాం×అనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టబోతోంది. అర్జీదారుడు నేరుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి తమ వినతులు పంపే సౌలభ్యం ఇందులో ఉంటుంది. ముఖ్యమంత్రి కార్యాలయం ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తుంది.

• సాధారణ సమస్యలు, ఎక్సైజ్, ఇసుక, అవినీతి, రైతు భరోసా, పాఠశాల విద్య తదితర అంశాలకు సంబంధించిన వినతులు పంపడానికి ఇప్పటికే కాల్ సెంటర్లు ఉన్నాయి. వీటితోపాటు ప్రతి సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమం ఉండనే ఉంది. అలాగే స్పందన వెబ్‌సైట్, స్పందన మొబైల్ అప్లికేషన్, జీఎస్‌డబ్ల్యూఎస్ వంటివి అందుబాటులో ఉన్నాయి. సంబంధిత ప్రభుత్వ శాఖలు గ్రీవెన్సెస్‌ను పర్యవేక్షిస్తున్నాయి. ప్రాధాన్యతలపై దృష్టి సారించడం లేదు. సాధారణ ఐవీఆర్‌ఎస్ రికార్డింగ్ ప్లే అవుతుంటుంది. ప్రభుత్వ శాఖల మార్పు, అర్జీ పరిష్కారం ఆలస్యానికిగల కారణం తదితర గ్రీవెన్స్ అప్‌డేట్ అర్జీదారునికి అందడం లేదు. ఇంకా ఇలాంటి చిన్నచిన్న సమస్యలు ఉన్నాయి.

స్పందన 2.0

స్పందనకు మరింత మెరుగైన రూపం ఇచ్చేందుకే జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని ప్రవేశ పెడుతున్నారు. అధికారులు ప్రతి వినతి పరిష్కారం అయ్యేంత వరకు ట్రాక్ చేయాలి. అర్జీలు గడువు లోపు నాణ్యతతో పరిష్కరించడం కార్యక్రమ ముఖ్య ఉద్దేశం. ఇది ఇప్పుడున్న స్పందనకు అత్యంత సమర్థవంతమైన, మెరుగైన విధానంగా అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. అర్జీల పరిష్కార కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి కార్యాలయం నేరుగా పర్యవేక్షిస్తుంది. రెవెన్యూ, పంచాయతీరాజ్, పోలీసు, మున్సిపల్, ఆరోగ్య-కుటుంబ సంక్షేమశాఖలకు సంబంధించిన అర్జీలే స్పందనలో అధికంగా వస్తున్నాయి. వీటి పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ వహించనున్నారు. అర్జీదారులు వినతుల సమర్పణ కోసం 1902 హెల్ప్‌లైన్ ఏర్పాటు చేశారు. అర్జీదారుడు తమ వాయిస్ మెసేజ్‌ను నేరుగా ముఖ్యమంత్రికి పంపే సౌలభ్యం ఈ కార్యక్రమంలో ఉంటుంది. అవసరమని భావించినపుడు ముఖ్యమంత్రి నేరుగా అర్జీదారులతో మాట్లాడే అవకాశం ఉంటుందని భావిస్తున్నారు.

జిల్లా స్థాయిలో ఆడిట్ టీమ్

అర్జీల పరిష్కారాన్ని పర్యవేక్షించేందుకు జిల్లా స్థాయిలో ఆడిట్ టీమ్ ఏర్పాటు చేయనున్నారు. ఇందులో జిల్లా పరిషత్ సీఈఓ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, ఈఓఅండ్ఆర్‌డీ, డిప్యూటీ తహసీల్దార్, మెడికల్ అధికారి ఉంటారు. మండల స్థాయిలో కూడా ప్రాజెక్టు మానిటరింగ్ విభాగాలు ఉంటాయి. మానిటరింగ్ యూనిట్లు సమర్థవంతంగా పనిచేయడంపైనే ఈ కార్యక్రమ విజయం ఆధారపడి ఉంటుంది. ప్రతివారం ఆడిట్ జరిపి నివేదికలు సమర్పించాల్సి ఉంటుంది. ముఖ్యమంత్రి కార్యాలయంలో కూడా మానిటరింగ్ విభాగం పనిచేస్తుంది. గ్రీవెన్స్ ఏ దశలో ఉందో తెలియజేస్తూ అర్జీదారులకు ఎప్పటికప్పుడు అప్‌డేట్స్ పంపుతారు. పరిష్కామైన ప్రతి సమస్య, అభిప్రాయాన్ని మరునాడే అధికారులు సేకరిస్తారు. పరిష్కారమైన సమస్యకు ముఖ్యమంత్రి సందేశంతో కూడిన యోగ్యతా పత్రాలను వలంటీర్లు అర్జీదారులకు అందజేస్తారు.

స్పందన అర్జీల సమాచారం

స్పందన కార్యక్రమానికి వచ్చే అర్జీల పరిష్కారం పట్ల కలెక్టర్ విజయరామరాజు ప్రత్యేక శ్రద్ధతీసుకుంటున్నారు. గడువులోపు పరిష్కారం అయ్యే విధంగా చర్యలు చేపడుతున్నారు. ఏదైనా ఓ ప్రభుత్వ విభాగానికి సంబంధించిన అర్జీల పరిష్కార గడువు ముగిసే సమయం దగ్గరలో ఉండగానే ఆ శాఖల అధికారులను అప్రమత్తం చేస్తున్నారు. దీంతో జిల్లాలో అర్జీలు బియాండ్ ఎస్ఎల్ఏలో లేవు. 2021 ఏప్రిల్ నుంచి ఈనెల 1వ తేదీ వరకు స్పందన అర్జీల నివేదికలు పరిశీలిస్తే మొత్తం అర్జీలు 32,160 ఉన్నాయి. ఇందులో వివిధ దశల్లో 583, పెండింగ్‌లో ఏడు, పరిష్కారమైనవి 3559 ఉన్నాయి.

జలకళ పథకం రైతులకు ప్రయోజనకరం



దిగువపల్లెలో బోరును పరిశీలిస్తున్న సీఆర్‌డీ డిప్యూటీ కమిషనర్ శశిధర్‌రెడ్డి

వల్లూరు : రైతులను ప్రోత్సహించి వ్యవసాయ రంగాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం కృషి చేస్తోందని రూరల్ డెవలప్‌మెంట్ కమిషనర్ (సీఆర్‌డీ) కార్యాలయ డిప్యూటీ కమీషనర్ శశిధర్ రెడ్డి పేర్కొన్నారు. అందులో భాగంగా రైతులకు ఉచితంగా బోరు వేసి విద్యుత్ మోటారును అందించడానికి రూపొందించిన వైఎస్‌ఆర్ జలకళ పథకం ఎంతో ప్రయోజనకరమని అన్నారు. వల్లూరు మండల పరిధిలోని దిగువపల్లె గ్రామంలో వైఎస్‌ఆర్ జలకళ పథకం కింద వేసిన బోరును గురువారం ఆయన పరిశీలించారు. బోరు, విద్యుత్ సౌకర్యం, మోటారు తదితర అంశాల గురించి రైతులతో మాట్లాడారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మెట్ట భూములకు ఈ పథకం కింద సాగు నీటిని అందించడం ద్వారా పంటలను సాగు చేసుకోవడానికి అవకాశం కలుగుతుందని అన్నారు. ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కమలాపురం ఏపీడీ సోమ శేఖర్‌రెడ్డి, డ్వామా అంబుడ్స్‌మెన్ సాంబ శివారెడ్డి, సోషల్ ఆడిట్ డీఆర్‌పీలు శివ కుమార్, శివయ్య, మాజీ సర్పంచ్ హరికేశవ రెడ్డి, ఏపీవో పార్థ సారథి, ఈసీ అన్నా నాయక్, క్లస్టర్ టిఏ సుబ్బారెడ్డి, టిఏ వీరాంజనేయులు, ఫీల్డ్ అసిస్టెంట్ నరసింహారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

లాహిరి... లాహిరి... లాహిరిలో..

కడప కల్చరల్ : దేవుని కడప శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయ వార్షిక తెప్పోత్సవాల్లో భాగంగా రెండవరోజు గురువారం పుష్కరిణిలో తెప్పపై స్వామి, అమ్మవార్లు ఐదుమార్లు విహరించారు. తొలుత ఆలయంలో స్వామి, అమ్మవార్ల మూలమూర్తులను పల్లకీపై కొలువుదీర్చి ఊరేగింపుగా పుష్కరిణి వద్దకు చేర్చారు. అక్కడి అలంకార మండపంలో విశేష అభిషేకాలు, అలంకారం చేసి, మంగళ హారతులు ఇచ్చి పుష్కరిణిలో సిద్ధంగా ఉంచిన తెప్పపై కొలువుదీర్చారు. ప్రత్యేక పూజల అనంతరం అర్చకులు తివిక్రమ్ బృందం, ఇన్‌స్పెక్టర్ ఈశ్వర్‌రెడ్డి పర్యవేక్షణలో మంగళ హారతులు ఇచ్చి తెప్పను జల విహారం చేయించారు. అందులో భాగంగా తొలిసారి వేద పండితుల మంత్రోచ్చాటనలతో, తర్వాత రెండు సార్లు టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారుల భక్తి గీతాలాపనలతో, మరో రెండుసార్లు మంగళ వాయిద్యాలతో స్వామి, అమ్మవార్లు పుష్కరిణిలో హాయిగా విహరించారు.



తెప్పపై అమ్మవారితో లక్ష్మీ వెంకటేశ్వర స్వామి

లక్ష్మీనరసింహా..నమోస్తుతే



హనుమద్వాహనంపై కొలువుదీరిన లక్ష్మీనరసింహస్వామి



స్వామివారి దర్శనం కోసం క్యూలైన్‌లో భక్తులు

పెండ్లిమర్రి : పెండ్లిమర్రి మండలంలోని వెయ్యినూతలకోన క్షేత్రంలో శ్రీలక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా గురువారం లక్ష్మీనరసింహస్వామి జయంతిని వంశపారంపర్య ధర్మకర్త పి.నరసింహ హరి ప్రసాద్, వేదపండితుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఉదయం స్వామివారికి అభిషేకం, వేదపారాయణం, మహామంగళహారతి, శాంతి హోమం, రాత్రి హనుమద్వాహన సేవ జరిగింది. బ్రహ్మోత్సవాలకు జిల్లా నలుమూల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. కోనేర్లలో స్నానాలు ఆచరించారు.స్వామివారికి మొక్కులు చెల్లించారు. తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

నేడు సూర్యప్రభ వాహన సేవ

నరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం సూర్యప్రభ వాహన సేవ, శాంతి హోమం, సహస్ర దీపాలంకరణ సేవ, శ్రీచక్ర పెరుమాళ్ సేవ, రాత్రికి గరుడసేవ జరుగుతుందని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

కోవిడ్ నిధులను కొట్టేశారు

- రూ లక్షల్లో సొంత ఖాతాకు మళ్లింపు
- దర్జాగా ఉద్యోగి చేతివాటం
- జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయంలో అవినీతి బాగోతం

కొంతమంది ఉద్యోగులకు జీతం కంటే 'చేతివాటం'పైనే మక్కువ ఎక్కువ. హుందాతనం ముసుగులో దర్జాగా అక్రమాలకు పాల్పడుతున్నారు. పైకి నీతులు చెబుతున్నారు. వైద్య ఆరోగ్య శాఖలో చాలా మంది చిత్త శుద్ధితో పనిచేసి ప్రశంసలు పొందుతున్నారు.. అదే సందర్భంలో మరికొందరికి 'అక్రమాల రోగం'పట్టుకుంది. అందుకు సరైన చికిత్స చేస్తే 'అవినీతి వైరస్'ఇతరులకు సోకకుండా ఉంటుంది.

కడప రూరల్ : జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో అదొక సెక్షన్. అక్కడ ఒకరి చొప్పున జూనియర్ అసిస్టెంట్, సీనియర్ అసిస్టెంట్ వారికి హెడ్‌గా ఒక సూపరింటెండెంట్ ఉంటారు. అందులో ఒక ఉద్యోగి చేతి వాటం ప్రదర్శించడంతో ఆ శాఖలో చర్చనీయాశంగా మారింది. సమాచారం మేరకు...ఆ ఉద్యోగి కోవిడ్ అంశానికి సంబంధించిన బిల్లులను చూస్తుంటారు అందులో సిబ్బంది వేతనాలు తదితరాలు ఉన్నాయి. ఈ బిల్లులను యధావిధిగా పై స్థాయి అధికారి పరిశీలిస్తుంటారు. ఈ క్రమంలో కొన్ని బిల్లుల్లో తేడాలను గుర్తించారు. క్షుణ్ణంగా పరిశీలించగా దాదాపు రూ 7 లక్షలకు పైగా నిధులు ఆ ఉద్యోగి సొంత ఖాతాలో జమ చేసుకున్నట్లు గుర్తించారు. వెంటనే ఈ విషయం ఆ శాఖ అధికారులు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై కలెక్టర్ సీరియస్ అయ్యారు. చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సంఘటన రెండు రోజుల క్రితం వెలుగు చూసింది. కాగా కాజేసిన డబ్బును ఆ ఉద్యోగి నంంచి రికవరీ చేసినట్లు తెలిసింది. అయితే అవినీతి కాస్త ఆలస్యంగానైనా బయట పడుతుంది. అన్నీ తెలిసినప్పటికీ ఆ ఉద్యోగికి అంత ధైర్యం ఎలా వచ్చిందో...? అని ఆ శాఖ ఉద్యోగులు చర్చించుకుంటున్నారు.



జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం

గతంలో కూడా...

గతంలో ఈ ఆ శాఖలోనే ఒక సెక్షన్‌లో పనిచేస్తున్న ఉద్యోగి తమ కుటుంబ సభ్యులను వైద్యులు..వైద్య సిబ్బందిగా సృష్టించి వేతనాల రూపంలో దాదాపు రూ 35 లక్షలకు పైగా అవినీతికి పాల్పడ్డారు. ఈ అంశాన్ని అప్పట్లో సాక్షి వెలుగులోకి తెచ్చింది. ఈ పరిణామం రాష్ట్ర వ్యాప్తంగా వైద్య ఆరోగ్య శాఖలో ప్రకంపనలను పుట్టించింది. తర్వాత ఆ ఉద్యోగిపై చర్యలు చేపట్టారు. ఏ స్థాయి అవినీతి అయినా సరే సమగ్రంగా విచారణ చేపట్టాలి. తెరవెనుక ఉన్న వారిని వెలుగులోకి తెచ్చి కఠినంగా శిక్షించాలి. అప్పుడే అక్రమాలకు అడ్డుకట్ట పడుతుందని ఉద్యోగులు అంటున్నారు.

చర్యలు తీసుకుంటాం



ఇందుకు సంబంధించి డిపార్ట్‌మెంట్ ఎంక్వైరీ జరుగుతోంది. పూర్తి స్థాయిలో విచారణ చేస్తున్నాం. అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకుంటాం. ఎవరైనా సరే నిబంధనలు అతిక్రమిస్తే ఉపేక్షించం. – డాక్టర్ నాగరాజు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి.

పవర్ ఫుల్

- వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల్లో కొత్తగా 35 విద్యుత్ సబ్‌స్టేషన్లు
- 14 సబ్‌స్టేషన్లు మంజూరు, మరో 21 సబ్‌స్టేషన్లకు త్వరలో అనుమతి
- వీటిలో జగనన్న కాలనీలకు ప్రాధాన్యత
- పనులు చేపట్టేందుకు టెండర్లు



బి.కొత్తకోట : ప్రజలకు, జగనన్న కాలనీల్లో విద్యుత్ సరఫరా సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఉన్నతాధికారులకు పంపిన కొత్త సబ్‌స్టేషన్ల ప్రతిపాదనలకు ప్రభుత్వం ఆమోదం తెలుపుతోంది. వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల్లో కొత్తగా 35 విద్యుత్ సబ్‌స్టేషన్ల నిర్మాణం జరగనుంది. దీనితో పల్లెలు, జగనన్న కాలనీల్లో విద్యుత్ వెలుగులు విరజిమ్మనున్నాయి. ఇప్పటికే నిధులు మంజూరైన 14 విద్యుత్ కేంద్రాల నిర్మాణాలకు సిద్ధంగా ఉండగా మరో 21 కేంద్రాలకు సంబంధించి టెండర్ల నిర్వహణ కోసం ప్రభుత్వానికి ప్రతిపాదించారు. వీటి నిర్మాణ పనులు పూర్తయితే ఈ రెండు జిల్లాల్లో విద్యుత్ సమస్యలు ఎదుర్కొంటున్న పల్లెలకు శాశ్వత పరిష్కారం లభించినట్లే.

నిరంతరాయంగా సరఫరా

కొత్తగా మంజూరై నిర్మించనున్న విద్యుత్ కేంద్రాలతో వినియోగదారులకు సమస్య అన్నది ఉండబోదు. విద్యుత్ వినియోగదారులకు లోఓల్టేజీ సమస్య శాశ్వతంగా పరిష్కారం అవుతుంది. సరఫరాలో అంతరాయం అనేది ఉండదు. లైన్ ఎక్కువ దూరంలో ఉండటం వల్ల సరఫరా నష్టాలు వస్తాయి. సబ్‌స్టేషన్ల సమీపం నుంచి సరఫరా లైన్లు ఉండటంవల్ల సరఫరా నష్టాలు ఉండవు. ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతినడం, వైఫల్యం చెందడం తగ్గిపోతుంది. 24 గంటలు సరఫరా ఉంటుంది. అలాగే జగనన్న కాలనీల్లో నిర్మించబోయే సబ్‌స్టేషన్లతో కాలనీలకు నిరంతరం విద్యుత్ సరఫరా ఉంటుంది. గృహ లబ్ధిదారులకు ఇబ్బంది కలగకుండా సేవలు అందుతాయి. ఇప్పటికే కాలనీల్లో పూర్తయిన ఇంటి నిర్మాణాలకు ప్రభుత్వం ఉచితంగా మీటర్లను అమర్చుతోంది. కనెక్షన్ పొందాలంటే రూ.4,100 చెల్లించాలి. ఈ భారం లబ్ధిదారులపై పడకుండా ప్రభుత్వం భారం మోస్తోంది. కనెక్షన్‌తోపాటు సర్వీసు వైరు, ఎంసీబీలు, బాక్సులు ఇస్తున్నారు. కాలనీల్లో లబ్ధిదారులకు ఇబ్బంది కలగకుండా 24 గంటల సరఫరా ఇస్తున్నారు.

నిర్మాణానికి సిద్ధమైన సబ్‌స్టేషన్లు

అన్నమయ్య, వైఎస్సార్ జిల్లాలకు చెందిన కడప మామిళ్లపల్లె, నానాపల్లె, మైదుకూరు వైఎస్సార్ జగనన్నకాలనీ, కుదాలి, కమ్మవారిపల్లె, ప్రొద్దుటూరు మీనాపురం, పులివెందుల చిలేకాంపల్లి, ఊడవగండ్ల, లోపట్నూతల, రాంనూతనపల్లె, వలిమెల్ల, అన్నమయ్య జిల్లాలోని కోడూరు నియోజకవర్గం రెడ్డివారిపల్లె, బాలపల్లె, గొబ్బూరువారిపల్లెలకు సబ్‌స్టేషన్లు మంజూరయ్యాయి. ఈ ప్రాంతాల్లో నిర్మించే 33/11 విద్యుత్ కేంద్రాలకు ప్రభుత్వం నుంచి అనుమతులు దక్కడంతో పనులు చేపట్టనున్నారు. వీటి నిర్మాణం కోసం రూ.35 కోట్లు వ్యయం చేయనున్నారు.

టెండర్ల దశలో..

వైఎస్సార్ జిల్లాలోని పులివెందుల జగనన్నకాలనీ, ప్రొద్దుటూరులోని రామేశ్వరం జగనన్నకాలనీ, బొల్లవరం జగనన్నకాలనీ, ఉక్కిసవాండ్లపల్లె, పైడిపాలెం, కమలాపురంలోని కొత్తగంగిరెడ్డిగారిపల్లె, గొందిపల్లెల్లో, అన్నమయ్య జిల్లాలోని సంబేపల్లె నారాయణరెడ్డిగారిపల్లె జగనన్నకాలనీ, గాలివీడులోని అరవీడు, చీమలచెరువు, తాడిగుంటపల్లెల్లో 33/11 విద్యుత్ కేంద్రాలను నిర్మించేందుకు రూ.26 కోట్లతో ప్రతిపాదించగా అనుమతులు లభించాయని, వీటికి టెండర్ల నిర్వహణ అనుమతుల కోసం ఎదురుచూస్తున్నామని డిస్కం ఉన్నతాధికారులు తెలిపారు. అలాగే అన్నమయ్య జిల్లాలోని పాత చిత్తూరు జిల్లా పరిధికి చెందిన తంబళ్లపల్లె నియోజకవర్గంలో రామాపురం, పాతకోట, పులికల్లు, మద్దినాయునిపల్లె, బి.కొత్తకోట ఇందిరమ్మకాలనీ, దిన్నిమీదపల్లెల్లో, మదనపల్లె నియోజకవర్గంలోని దండువారిపల్లె, మట్లివారిపల్లె, పీలేరు నియోజకవర్గంలోని బాలయ్యగారిపల్లె, సరిమడుగుల్లో 33/11 విద్యుత్ కేంద్రాల నిర్మాణం కోసం ప్రభుత్వం రూ.25 కోట్లు వ్యయం చేయనుంది.

అనుమతి రాగానే టెండర్లు



ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని తంబళ్లపల్లె, మదనపల్లె, పీలేరు నియోజకవర్గాల్లో పది కొత్త విద్యుత్ కేంద్రాల నిర్మాణాల కోసం ప్రభుత్వానికి నివేదించాం. వీటి పనులు చేపట్టడం కోసం ప్రభుత్వం నుంచి అనుమతి రాగానే టెండర్లను నిర్వహించి చర్యలు చేపడతాం. – ఎం.కృష్ణారెడ్డి, డిస్కం ఎస్ఈ, తిరుపతి

రీ సర్వే, భూ సేకరణ వేగవంతం చేయాలి

కడప సెవెన్‌రోడ్స్ : జిల్లాలో రీ సర్వే, భూ సేకరణ పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ విజయరామరాజు అధికారులను ఆదేశించారు. గురువారం చీఫ్ సెక్రటరీ జవహర్‌రెడ్డి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ తర్వాత కలెక్టర్ అధికారులనుద్దేశించి మాట్లాడారు. రీ సర్వేలో భాగంగా స్టోన్ ప్లాంటేషన్ పూర్తి చేయాలని చెప్పారు. రెవెన్యూ, భూ రికార్డుల స్వచ్ఛీకరణపనులు వేగవంతం చేయాలన్నారు. జాతీయ రహదారుల అభివృద్ధి, విస్తరణ కోసం చేపడుతున్న భూసేకరణ ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలన్నారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని తాగునీటికి కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. లైవ్ స్టాక్ పెంపుదల, వేసవిలో సంక్రమించే సీజనల్ వ్యాధుల నుంచి పశు పక్షాదులను కాపాడాలని చెప్పారు. పశు వైద్య కేంద్రాల్లో వసతులు మెరుగు పరచాలన్నారు. వన్యప్రాణుల సంరక్షణ, తాగునీటి సదుపాయం కల్పించడంలో అటవీశాఖ, డ్వామా తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. అలాగే ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను లక్ష్యం మేరకు పూర్తి చేయాలన్నారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న జగనన్న కాలనీలు త్వరగా పూర్తి కావాలని చెప్పారు. ఉపాధి హామి పథకంలో కూలీలకు సకాలంలో బిల్లులు అందేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో జేసీ గణేష్‌కుమార్, అసిస్టెంట్ కలెక్టర్ రాహుల్‌మీనా తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ధ్వజారోహణం


ధ్వజారోహణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న వేద పండితులు

జమ్మలమడుగు : పట్టణంలోని నారాపురస్వామి బ్రహోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం ధ్వజారోహణ కార్యక్రమాన్ని తిరుమల తిరుపతికి చెందిన వేదపండితుల మధ్య ఘనంగా నిర్వహించారు. ఉదయం ఆలయం ఎదురుగా ఉన్న ధ్వజ స్తంభానికి ప్రత్యేక పూజలను నిర్వహించి ఆంజనేయుడు చిహ్నాం గల జెండాను ధ్వజస్తంభంపై ఆవిష్కరించారు. అనంతరం ప్రత్యేక పూజలను నిర్వహించారు. అనంతరం స్వామివారికి ఊంజల్ సేవ నిర్వహించారు. సాయంత్రం పెద్దశేష వాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. శుక్రవారం ఉదయం 8 గంటలకు చిన్న శేష వాహనంపై స్వామి వారిని పురవీధుల గుండా ఊరేగింపు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ అధికారులు పేర్కొన్నారు.

నాలుగు బైకులు స్వాధీనం

రాజంపేట : పట్టణంలో వివిధ వ్యక్తులకు సంబంధించిన నాలుగుబైకులను పట్టుకున్నామని సీఐ ఎస్వీ నరసింహారావు, ఎస్ఐ వీఎల్ ప్రసాద్‌రెడ్డిలు గురువారం వెల్లడించారు. బాధితులు గండికోట కృష్ణమూర్తి, షేక్ ఉమ్మరి, చింతల నరేంద్ర బాబు, వలిమి శివరామయ్యలు తమ బైకులు చోరీకి గురయ్యాయని ఫిర్యాదు చేశారు. చోరీలపై దర్యాప్తు నిర్వహించిన పోలీసులు పట్టణంలోని కొలిమివీధికి చెందిన లవిడి చంద్రశేఖర్‌రాజును అరెస్టు చేసి అతడు చోరి చేసిన బైకులను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదుచేసి, రిమాండ్‌కు తరలించామని పోలీసులు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ వెంకటేశ్వర్లు, పట్టణ పోలీసులు తెలిపారు.

ఆర్టీసీలో కారుణ్య నియామకాలు

- మృతుల కుటుంబాలకు అండగా నిలుస్తున్న ప్రభుత్వం
- జిల్లాలో 39 మందికి అవకాశం
- 2016 నుంచి పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులకు మోక్షం


కారుణ్య నియామక అభ్యర్థుల సర్టిఫికెట్లను పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఏపీఎస్ ఆర్టీసీలో పని చేస్తూ మృతి చెందిన ఉద్యోగుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తోంది. మృతుల కుటుంబంలో ఒకరికి కారుణ్య నియామకం కింద ఉద్యోగం ఇస్తోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇప్పటికే రెండు విడతలుగా కారుణ్య నియామకాలను చేపట్టింది. తాజాగా మూడో విడత కింద ఆ శాఖలోనే కానిస్టేబుల్ ఉద్యోగాలు ఇచ్చేందుకు శ్రీకారం చుట్టింది. ఈ మేరకు గతనెల 17వ తేదిన సర్టిఫికెట్లను కడపలోని ఆర్ఎం కార్యాలయంలో పరిశీలించారు. వీరికి కర్నూలులో దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.

ప్రక్రియ ఇలా..

ఏపీఎస్ ఆర్టీసీలో పనిచేస్తూ మృతి చెందిన కార్మికులు, ఉద్యోగుల పిల్లలకు ఉద్యోగ అవకాశం కోసం ఏడాదిలోపు దరఖాస్తులను చేసుకోవాలి. ఉద్యోగం కోరిన వ్యక్తి ఉద్యోగి భార్య, భర్తతోపాటు అన్నదమ్ముల నుంచి ఎన్‌ఓసీ, వారసత్వ సర్టిఫికెట్ సమర్పించాలి. దీనిపై ఆర్టీసీ సెక్యూరిటీ, విజిలెన్స్ అధికారులు విచారణ నిర్వహిస్తారు. విద్యార్హత, కుల, నివాస తదితర సర్టిఫికెట్లను పరిశీలించి ధృవీకరిస్తారు. అన్నీ సక్రమంగా ఉంటే వారికి ఉద్యోగం ఇవ్వవచ్చని సిఫార్సు చేస్తారు.

మూడవ విడతలో 39 మందికి ఛాన్స్..

వైఎస్సార్ జిల్లాలో మూడవ విడత కారుణ్య నియామకాల కింద 39 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు సచివాలయ ఉద్యోగాలు ఇచ్చారు. మొదటి విడతలో డిగ్రీ అర్హత ఆప్షన్ మేరకు గ్రామ పంచాయతీ సెక్రటరీలు, మిగిలిన శాఖల్లో ఉద్యోగాలు ఇచ్చారు. రెండవ విడతలో ఒకరికి జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగం ఇచ్చారు. 2019 జనవరి 1 నుంచి 2019 డిసెంబరు 31 వరకు పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను ఎంపిక చేసి ఆర్టీసీ కానిస్టేబుల్ (10వ తరగతి అర్హతతో) ఉద్యోగాలు ఇచ్చేందుకు సర్టిఫికెట్లను పరిశీలించారు. వీరిలో 14 మందిని ఎంపిక చేశారు. దీంతో ఆయా కుటుంబాల్లో ఆనందం వెల్లివిరుస్తోంది.

పట్టించుకోని చంద్రబాబు

ఆర్టీసీలో పనిచేస్తూ మృతి చెందిన ఉద్యోగుల పిల్లలు కారుణ్య నియామకాల కోసం దరఖాస్తు చేసుకుని ఏళ్ల తరబడి ఎదురు చూస్తూ వచ్చారు. 2019 కంటే ముందు జిల్లాలో 120 మంది దరఖాస్తు చేసుకున్నారు. అప్పటి చంద్రబాబు సర్కార్ పట్టించుకున్న పాపాన పోలేదు. అయితే వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడమే కాకుండా కారుణ్య నియామకాల కింద 2019 నుంచి విడతల వారీగా ఉద్యోగాలు ఇచ్చారు. తాజాగా మరోసారి మిగిలిన వారికి ఉద్యోగాలు ఇవ్వనున్నారు.

కర్నూలులో దేహదారుఢ్య పరీక్షలు

ఏపీఎస్ ఆర్టీసీలో ఖాళీగా ఉన్న 14 కానిస్టేబుల్ ఉద్యోగాల భర్తీకి ఇటీవల ఎత్తు, బరువు, ఛాతి కొలతలు తీసుకున్నారు. అర్హత సాధించిన అభ్యర్థులకు కర్నూలులోని సెయింట్ జోసెఫ్ డిగ్రీ కళాశాల మైదానంలో దేహ దారుఢ్య పరీక్షలు నిర్వహించనున్నారు. ఇందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ప్రజా రవాణాధికారి గోపాల్‌రెడ్డి తెలిపారు. ఇందులో అర్హత సాధించని, కానిస్టేబుల్ ఉద్యోగానికి ఆసక్తి చూపని అభ్యర్థులకు మరో విడతలో శ్రామిక్ పోస్టుల ద్వారా ఉపాధి కల్పించనున్నారు.

ముఖ్యమంత్రికి రుణపడి ఉన్నాం



ఎప్పటి నుంచో పెండింగ్‌లో ఉన్న ఆర్టీసీ కారుణ్య నియామకాలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించిన తర్వాత అంచెలంచెలుగా భర్తీ చేస్తూ బాధిత కుటుంబాల్లో వెలుగులు నింపారు.

-ఎస్.బాబా ఫక్రుద్దీన్, రాష్ట్ర ఉపాధ్యక్షులు, వైఎస్సార్ ఎంప్లాయిస్ అసోసియేషన్, కడప

హర్షణీయం



ఆర్టీసీలో పనిచేస్తూ మృతి చెందిన ఉద్యోగుల కుటుంబాల్లో ఒకరికి ఉపాధి కల్పించడం హర్షణీయం. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇప్పటికే ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసి అన్ని విధాల ఆదుకున్నారు. ఈ విషయంగా ముఖ్యమంత్రికి కార్మికులు, ఉద్యోగుల తరుపున కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం.

- కేకే కుమార్, జోనల్ అధ్యక్షులు, ఎంప్లాయిస్ యూనియన్, కడప

ముఖ్యమంత్రి నిర్ణయం స్వాగతిస్తున్నాం



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం. ఆర్టీసీలో పనిచేస్తూ మృతి చెందిన ఉద్యోగుల కుటుంబాలను ఆదుకుంటూ ఉపాధి కల్పిస్తున్నారు. కుటుంబ సభ్యులను కోల్పోయి తీవ్ర ఆవేదనలో ఉన్న కుటుంబాలకు అండగా నిలుస్తున్న ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలియజేస్తున్నాం.

- సగినాల శ్రీనివాసులు, ఎన్ఎంయూ డిపో అధ్యక్షులు, కడప

ఉపాధి కల్పించి ఆదుకున్నారు



ఆర్టీసీలో కారుణ్య నియామకాలు చేపట్టి ముఖ్యమంత్రి ఆయా కుటుంబాలను ఆదుకున్నారు. చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న ఈ సమస్యను ముఖ్యమంత్రి చొరవ తీసుకుని పరిష్కరించడం సంతోషదాయకం.

- ఎం.పురుషోత్తం, కార్మిక పరిషత్ రీజినల్ కార్యదర్శి, కడప

తల్లి, ఇద్దరు కుమార్తెలు అదృశ్యం


తప్పిపోయిన మహిళ సయ్యద్ జమీలా, కుమార్తెలు (ఫైల్)

కడప అర్బన్: కడప నగరం నకాష్‌లో నివాసం వుంటూ వినాయక్‌నగర్‌లో మెకానిక్‌గా పనిచేస్తున్న సయ్యద్ షేక్‌షా తన భార్య, ఇద్దరు పిల్లలు కనిపించడం లేదని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తన భార్య సయ్యద్ జమీలా, తన ఇద్దరు కుమార్తెలు సయ్యద్ యూసఫా(5), సయ్యద్ జోయా (2)లతో కలిసి గత నెల 23 న ఇంటి నుంచి వెళ్లిపోయి కనిపించలేదని షేక్ షా పోలీసులకు తెలియజేశారు. గతనెల 19న తన భార్య సెల్‌ఫోన్‌ను చూసి గేమ్‌లను ఆడుతుండగా ఇదేంటని భర్త, భార్యతో గొడవపడ్డాడు. తరువాత మనస్పర్ధలు విడనాడి అన్యోన్యంగా వున్నారు. గత నెల 23 న సాయంత్రం తాను ఇంటి నుంచి టీ తాగడానికి బయటకు వెళ్లి తిరిగి వచ్చేలోపు తన భార్య, ఇద్దరు పిల్లలు కనిపించకుండా పోయారని తెలియజేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ జయరాములు తెలియజేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు


తీవ్రంగా గాయపడిన గంగయ్య

అట్లూరు : మండల పరిధిలోని అట్లూరు క్రాస్ రోడ్డు వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాలిశెట్టిగంగయ్య తీవ్ర గాయాలపాలయ్యాడు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. అట్లూరు మండలం ఎస్.వెంకటాపురం తూడూరు కాలనీకి చెందిన గాలిశెట్టిగంగయ్య తన ద్విచక్ర వాహనంపై తన అత్తగారి గ్రామమైన పెనగలూరు మండలం ఓబిలి గ్రామానికి బయలుదేరాడు. బెంగుళూరు నుండి పెనుశిల నరసింహస్వామి సన్నిధికి వెళుతున్న ఇన్నోవా వాహనం అట్లూరు క్రాస్‌రోడ్డు సమీపానికి వచ్చేసరికి ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో గాలిశెట్టిగంగయ్య తీవ్ర గాయాలపాలయ్యాడు. హుటాహుటిన స్థానికులు 108 వాహనంలో రంగయ్యను కడప రిమ్స్‌కు తరలించారు.

రిమ్స్‌లో మానసిక రోగి మృతి

వైద్యుల నిర్లక్ష్యంతో చనిపోయాడని మృతుడి భార్య ఆర్ఎంఓకు ఫిర్యాదు


కడప రిమ్స్ ఆర్ఎంఓ కు ఫిర్యాదు చేస్తున్న మృతుడు కిరణ్‌కుమార్ భార్య రేష్మా

కడప అర్బన్ : కడప నగర శివార్లలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (రిమ్స్)లో వైద్యసేవల కోసం మానసిక వ్యాధితో బాధపడుతూ వచ్చిన మన్నేపల్లి కిరణ్‌కుమార్ (32) అనే వ్యక్తి మృతి కేవలం డాక్టర్ల నిర్లక్ష్యం వల్లనే జరిగిందని, అతని భార్య ఎం. రేష్మా తెలియజేశారు. ఈ మేరకు రిమ్స్ ఆర్ఎంఓ డాక్టర్ శ్రీనివాసులుకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదులో వివరాలిలా వున్నాయి. జిల్లాలోని మైదుకూరు మండలం శెట్టివారిపల్లెకు చెందిన ఎం. కిరణ్‌కుమార్ పీజీ వరకు చదివారు. కొంతకాలంగా మానసిక అనారోగ్యంతో బాధపడుతూ వుండేవాడు. ఈనెల 1వ తేదీన తాను వాడాల్సిన మందుల మోతాదును పెంచి వాడటం వలన అపస్మారక స్థితిలోకి వెళ్లి పోయాడు. దీంతో కుటుంబసభ్యులు అతన్ని కడప రిమ్స్‌కు ఈనెల 2వ తేదీన చేర్పించారు. గురువారం రిమ్స్‌లోని ఎంఐసీయూ విభాగంలో చికిత్సపొందుతున్న అతను బంధువులను అందరినీ కళ్లు తెలిచి చూశాడనీ, తరువాత ఎలాంటి అనుభవంలేని జూనియర్ డాక్టర్లచేత వైద్యం చేయించారని, దీని వలన తన భర్త మృతి చెందినట్లుగా భార్య రేష్మ ఆరోపించింది. తమకు న్యాయం చేయాలని రిమ్స్ అధికారులకు విజ్ఞప్తి చేసింది. ఈ ఫిర్యాదును స్వీకరించిన ఆర్ఎంఓ డాక్టర్ శ్రీనివాసులు మాట్లాడుతూ ఈ సంఘటనపై సమగ్రంగా విచారిస్తామన్నారు.

రెండు ఇళ్లలో దొంగతనం

పోరుమామిళ్ల : పట్టణంలోని కాపువీధిలో రెండు ఇళ్లలో దొంగతనం జరిగింది. వల్లెల ఓబుల్‌రెడ్డి భార్య భారతమ్మతో కలసి నెల క్రితం అమెరికా వెళ్లాడు. ఆయన ఇంటి తలుపు తెరచి ఉండటం గురువారం సాయంత్రం 7 గంటల సమయంలో స్థానికులు గమనించారు. ఆ ఇంట్లో ఎప్పుడు దొంగలు పడ్డారో? ఏమి తీసుకెళ్లారో తెలియదు. ఓబులరెడ్డి కూతురు హైదరాబాదులో ఉంది. ఆమెకు విషయం చెప్పడంతో ఆమె పోరుమామిళ్లకు బయలుదేరింది. శుక్రవారం ఆమె వచ్చాక ఆ ఇంట్లో ఏమి పోయిందో తెలుస్తుంది. అలాగే పోతిరెడ్డి రమణారెడ్డి ఇంటికి తాళం వేసి రెండు రోజులు ప్రొద్దుటూరు వెళ్లారు. గురువారం ఉదయం ఆ ఇల్లు తలుపు తెరచి ఉండటం చూసిన స్థానికులు ఆయన అన్నదమ్ములకు చెప్పడంతో దొంగతనం వెలుగు చూసింది. రమణారెడ్డి వచ్చి ఇంట్లో ఉన్న రూ. 80 వేలు నగదు, వెండి సామాను, కొంత బంగారు పోయినట్లు గమనించారు. సమాచారం పోలీసులకు చెప్పడంతో కడప నుండి వేలిముద్రల నిపుణులు వచ్చి ఫోటోలు తీసుకున్నారు. రమణారెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తున్నట్లు ఎస్ఐ హరిప్రసాద్ తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్ పేలి ఇరువురు మహిళలకు గాయాలు

ప్రొద్దుటూరు క్రైం : దొరసానిపల్లె రోడ్డులోని మహేంద్రనగర్‌లో గురువారం సాయంత్రం ట్రాన్స్‌ఫార్మర్ పేలిన ఘటనలో మదార్‌బీ, సుబ్బమ్మ అనే ఇరువురు మహిళలు గాయపడ్డారు. సుబ్బమ్మ ఇంట్లో మదార్‌బీ పని చేయడానికి వెళ్తుంటుంది. పని అయిపోవడంతో మదార్‌బీ, సుబ్బమ్మ ఆరుబయట కూర్చొని మాట్లాడుకుంటున్నారు. ఈ క్రమంలో పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ పేలడంతో అందులోని ఆయిల్ మీదపడి ఇరువురు గాయపడ్డారు. మదార్‌బీ జిల్లా ఆస్పత్రిలో, సుబ్బమ్మ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

తాగునీరు అందించాలంటూ నిరసన

ఓబులవారిపల్లె : మంగంపేట ఏపీఎండీసీలో ఉద్యోగులకు, కార్మికులకు తాగునీరు అందించాలని ఏపీఎండీసీ కార్యాలయం ఎదుట ఉద్యోగులు గురువారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో వలే ఉద్యోగులకు తాగునీరు అందించాలని, ప్రస్తుతం ఎండలు అధికంగా ఉన్నాయని, దీంతో కార్మికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీఎండీసీ పోరాట కమిటీ జేఏసీ కన్వీనర్ ఆర్ వెంకటేష్, ఉద్యోగ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ప్రతిభ కనబరిచిన పంచాయతీలకు అవార్డులు



మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ సుధాకర్‌రెడ్డి

కడప సెవెన్‌రోడ్స్ : జిల్లాలో ప్రతిభ కనబరిచిన గ్రామ పంచాయతీలకు అవార్డులు ఇస్తామని జెడ్పీ సీఈఓ సుధాకర్‌రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్‌రెడ్డిలు తెలిపారు. గురువారం జిల్లా పరిషత్ ఆవరణలోని డీపీఆర్‌సీ భవనంలో పీర్ కమిటీ సభ్యులకు నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో వారు మాట్లాడారు. గ్రామ పంచాయతీలు తమ పనితీరు మెరుగు పరుచుకునేందుకు పోటీ పడాలని చెప్పారు. గ్రామ పంచాయతీల్లో ఆరోగ్యకరమైన పోటీని ఏర్పాటు చేసేందుకే పీర్ కమిటీ సభ్యులు వెరిఫికేషన్ చేయనున్నారని చెప్పారు. పీర్ కమిటీలో సర్పంచ్, పంచాయతీ సెక్రటరీ, మండల విస్తరణ అధికారి, ఎస్‌హెచ్‌జీ సభ్యురాలు, కంప్యూటర్ ఆపరేటర్ ఉంటారని వివరించారు. నిబంధనల ప్రకారం పీర్ కమిటీ ఇతర గ్రామ పంచాయతీల్లో వెరిఫికేషన్ చేయాల్సి ఉంటుందన్నారు. ఆ తర్వాత అదేరోజు డేటాను కంప్యూటర్‌లో నిక్షిప్తం చేయాలన్నారు. పీర్ కమిటీ వెరిఫికేషన్‌కు 45 రోజుల సమయం ఇస్తున్నామన్నారు. ఇప్పటివరకు పంచాయతీల్లో స్వీయ పరిశీలన జరిగిందని, ఇకపై పీర్ కమిటీ వెరిఫికేషన్ జరగనుందన్నారు. పారిశుద్ధ్యంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రతి ఇంటిలో మరుగుదొడ్డి ఉండేలా చూడాలన్నారు. కమిటీ సభ్యుల వెరిఫైడ్ స్కోర్ ఆధారంగా ఉత్తమ గ్రామ పంచాయతీలను గుర్తిస్తామని తెలిపారు. కనుక సభ్యులు వెరిఫికేషన్ చాలా జాగ్రత్తగా చేయాలని సూచించారు. డీపీఆర్‌సీ కో ఆర్డినేటర్ వెంకటేశ్ పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా పీర్ కమిటీ గురించి వివరించారు. గ్రామ పంచాయతీల్లో వెరిఫికేషన్ ఎలా చేయాలో తదితర అంశాలను వివరించారు. ఈ సమావేశంలో కడప డీఎల్‌పీఓ మస్తాన్‌వలీ, పలువురు సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, మండల విస్తరణ అధికారులు, స్వయం సహాయక సంఘ సభ్యులు, కంప్యూటర్ ఆపరేటర్లు పాల్గొన్నారు.


జాతీయస్థాయి పోటీల్లో జిల్లా ఆణిముత్యం మెరుపులు


ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందుకుంటున్న బొమ్ము అంకిత

కడప స్పోర్ట్స్ : జాతీయస్థాయి జూనియర్ హాకీ నేషనల్స్‌లో కడప క్రీడాకారిణి సత్తాచాటుతోంది. ఈనెల 4 నుంచి 14వ తేదీ వరకు ఒడిశా రాష్ట్రం రూర్కెలాలో నిర్వహిస్తున్న 13వ హాకీ ఇండియా సబ్‌జూనియర్ ఉమన్ నేషనల్ చాంపియన్‌షిప్–2023లో ఏపీ జట్టుకు కెప్టెన్‌గా ప్రాతినిధ్యం వహించిన బొమ్ము అంకిత ఆటలో ఉత్తమ ప్రతిభ కనబరుస్తూ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డును కైవసం చేసుకుంది. గురువారం పంజాబ్‌తో నిర్వహించిన మ్యాచ్‌లో ఈమె గోల్స్ చేసి జట్టు విజయంలో కీలకంగా వ్యవహరించడంతో ఈమెకు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డును నిర్వాహకులు అందజేశారు.

చింతకొమ్మదిన్నె మండలం బుగ్గలేటిపల్లెకు చెందిన బొమ్ము లక్ష్మీదేవి, సుబ్బారెడ్డి దంపతుల కుమార్తె అయిన ఈమె 4వ తరగతి నుంచి కడప నగరంలోని వైఎస్ఆర్ క్రీడాపాఠశాలలో శిక్షణ పొందింది. ప్రస్తుతం బెంగుళూరు సాయ్ హాకీ అకాడమీలో శిక్షణ పొందుతూ జాతీయస్థాయిలో రాణిస్తోంది. జిల్లా క్రీడాకారిణి ప్రతిభ పట్ల పలువురు క్రీడాకారులు, హాకీ సంఘం ప్రతినిధులు సంతోషం వ్యక్తం చేశారు.

కడప, నెల్లూరు జట్ల విజయం


తలపడుతున్న కడప, కర్నూలు జట్లు


110 పరుగులు చేసిన కడప బ్యాట్స్‌మన్ జహీర్ అబ్బాస్

కడప స్పోర్ట్స్ : ఏసీఏ అండర్–23 పురుషుల వన్డే క్రికెట్ టోర్నమెంట్‌లో గురువారం నిర్వహించిన మ్యాచ్‌లో కడప, నెల్లూరు జట్లు తలపడ్డాయి. వైఎస్ రాజారెడ్డి–ఏసీఏ క్రికెట్ మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో కడప, కర్నూలు జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన కర్నూలు జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. నిర్ణీత 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 254 పరుగులు చేసింది. జట్టులోని మహేంద్ర 51, సాయిసూర్యతేజ 48 పరుగులు చేశారు. కడప బౌలర్ విజయ భవేంద్ర 4 వికెట్లు తీశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కడప జట్టు 42 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 255 పరుగులు చేసింది. జట్టులోని జహీర్ అబ్బాస్ 110 పరుగులు చేశాడు. దీంతో కడప జట్టు 6 వికెట్ల తేడాతో విజయం సాధించింది.

అనంతపై నెల్లూరు విజయం..

కేఎస్ఆర్ఎం మైదానంలో నిర్వహించిన మరో మ్యాచ్‌లో అనంతపురం, నెల్లూరు జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన అనంతపురం జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్‌కు దిగిన అనంతపురం జట్టు 27.3 ఓవర్లలో 125 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని చరిష్‌రెడ్డి 37 పరుగులు చేశాడు. నెల్లూరు బౌలర్ సాకేత్‌రామ్ 4 వికెట్లు తీశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన నెల్లూరు జట్టు 33.3 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 126 పరుగులు చేసింది. జట్టులోని నిఖిలేశ్వర్‌రెడ్డి 52 పరుగులు చేశాడు. దీంతో నెల్లూరు జట్టు 7 వికెట్ల తేడాతో విజయం సాధించింది.

ఫ్యామిలీ ఫిజీషియన్ సేవలు వినియోగించుకోవాలి


వైద్యులు, అధికారులకు సూచనలిస్తున్న ఫ్యామిలీ ఫిజీషియన్ రాష్ట్ర పరిశీలకులు డాక్టర్ రమాదేవి

చెన్నూరు : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని ఇంటి వద్దకే డాక్టర్ల బృందాన్ని పంపి చికిత్స అందించేందుకు ఫ్యామిలీ ఫిజీషియన్ వ్యవస్థను అందుబాటులోకి తీసుకువచ్చారని ఫ్యామిలీ ఫిజీషియన్ రాష్ట్ర పరిశీలకులు(నోడల్ ఆఫీసర్) డాక్టర్ రమాదేవి అన్నారు. గురువారం ఆమె మండలంలోని ఉప్పరపల్లె లో పర్యటించి ఆరోగ్య ఉప కేంద్రాలలో గ్రామీణ పేదలకు వైద్యం సక్రమంగా అందుతుందా లేదా అని పరిశీలించారు. ముఖ్యమంత్రి ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసే దిశగా వైద్య సిబ్బంది కృషి చేయాలని సూచించారు. అదేవిధంగా అంగన్వాడీ, ప్రభుత్వ పాఠశాలలు పరిశీలించారు. పలు సూచనలు ఇచ్చారు. గ్రామీణ ప్రాంతాలలో శానిటేషన్ పై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి డాక్టర్ చెన్నారెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.